www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -59 శనివారం 13 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..

### ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ

మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి

మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,జూన్ 12 (ప్రజావినికిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు. మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. **మిగతా 2లో...**

## మోడీకి ఎదురుతిరిగితే

# ప్రాజెక్టులు రావా?

### మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి

తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు

కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు

హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా

మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు

ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ





**న్యూఢిల్లీ,జూన్ 12(ప్రజావినికిడి):** :తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చున్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. **మిగతా 2లో...**




## సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు

హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి

అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి




## రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

విజేతల జాబితాలో ఖర్గే, తరుణ్ చుగ్



**న్యూఢిల్లీ,జూన్ 12 (ప్రజావినికిడి):** రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా **మిగతా 2లో...**

## శాంతి చర్చల డైలమా



ఇంకా ఏదీ ఖరారు కాలేదు

ట్రంప్ ఒప్పందం ప్రకటనను

తోసిపుచ్చిన ఇరాన్

ఇంకా చర్చలు

కొనసాగుతున్నాయి

ఎలాంటి తుది నిర్ణయమూ

తీసుకోలేదని స్పష్టీకరణ



**వాషింగ్టన్, టెహ్రాన్ : జూన్ 12 (ప్రజావినికిడి):** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌తో జరుగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం త్వరలోనే కుదిరే అవకాశముందని ప్రకటించినప్పటికీ ఆ విషయాన్ని ఇరాన్ తోసిపుచ్చింది. చర్చలు కొనసాగుతున్నాయనీ, అయితే ఇంకా ఎలాంటి తుది నిర్ణయమూ తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పష్టం చేశారు. దీంతో మధ్యప్రాచ్యంలో ఇప్పటికీ అనిశ్చితి కొనసాగుతోంది.

ట్రంప్ ఏమన్నారు?

ఇరాన్‌పై మరోసారి భారీ సైనిక దాడులు చేయాలని అమెరికా సిద్ధమైందని హెచ్చరించిన ట్రంప్.. అనంతరం చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయకూడదన్నదే మా ప్రధాన లక్ష్యం. ఆ దిశగా గొప్ప ఒప్పందం**మిగతా 2లో...**

## మనది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి

రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది

రాయలసీమను రాయల్ సీమగా మార్చాం

తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు




## పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు


పరిశ్రమలు బంకుల నుంచి కొనొద్దని ఆదేశాలు

బల్క్ డిపోల నుంచే ఇంధనం కొనాలని సూచన

రోజుకు 200 లీటర్ల డీజిల్‌కే అనుమతి

ఆంక్షలు 90 రోజుల పాటు అమలు

నిల్వలు, బ్లాక్‌మార్కెట్‌పై కఠిన చర్యలు



**న్యూఢిల్లీ, జూన్ 12 (ప్రజావినికిడి):** దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, పెద్ద కంపెనీలు ఇకపై పెట్రోల్ బంకుల నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ ఆదేశాలు జారీ చేసింది. **2లో...**

## విద్యుత్ ఛార్జీలను పెంచబోం

జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దామన్న గొట్టిపాటి

ట్రూడౌన్ విధానం ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించామని వెల్లడి




## తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది

ఇటీవల పవన్ సభకు అనుమతి నిరాకరించిన తెలంగాణ ప్రభుత్వం

శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయమే అన్న రేవంత్

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జూన్ 12(ప్రజావినికిడి):** తెలంగాణలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని,**మిగతా 2లో...**

# రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..

మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్ద పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

# మోడీకి ఎదురుతిరిగితే ప్రాజెక్టులు రావా?

మొదటిపేజీ తరువాయి

తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డును కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

**సిద్ధిపేటజూన్ 12(ప్రజావినికిడి):**
సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నాననని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

--------

# యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

**హైదరాబాద్,జూన్ 12(ప్రజావినికిడి):**సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు.

# మనది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి

### తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు

**తిరుపతిజూన్ 12(ప్రజావినికిడి):**
కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.
అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ

# పవన్ కల్యాణ్‌కు ఉంది

మొదటిపేజీ తరువాయి

పవన్ కల్యాణ్‌కు కూడా అదే వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు.
తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు.
ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.
ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

మొదటిపేజీ తరువాయి

వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు. రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.

# శాంతి చర్చల డైలమా

మొదటిపేజీ తరువాయి

కుదిరే దశలో ఉంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఒప్పంద పత్రాలు దాదాపు సిద్ధంగా ఉన్నాయనీ, కొన్ని రోజుల్లోనే వాటిపై సంతకాలు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. యూరప్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశముందని కూడా వెల్లడించారు. ఇరాన్ సుప్రీం లీడర్ కూడా ఈ ఒప్పందాన్ని ఆమోదించారని ట్రంప్ ధృవీకరించారు. ఒప్పందంపై సంతకాలు పూర్తి కాగానే ఇరాన్‌పై ఉన్న దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఎత్తివేస్తుందని, దీనివల్ల చమురు ధరలు భారీగా పడిపోతాయని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం అణు ఆయుధాలను అభివృద్ధి చేయబోమని, వాటిని కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఇరాన్‌తో కుదిరే ఈ అధికార ఒప్పందం పూర్తయ్యే వరకు అమెరికా, మిత్రదేశాలు అమలు చేస్తున్న నౌకాదళ దిగ్బంధం (నావల్ బ్లాకేడ్) యథావిధిగా కొనసాగుతుందని ట్రంప్ తన సోషల్‌ట్రూత్‌లో స్పష్టం చేశారు. తుది ఒప్పంద పత్రాలపై సంతకాలకు సంబంధించిన తేదీ, ప్రదేశ వివరాలను త్వరలో ప్రకటిస్తామని ఆయన వివరించారు.

**ఇరాన్ స్పందన**

అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ జాగ్రత్తగా ఖండించింది. ఒప్పంద ముసాయిదాలో ఎక్కువ భాగం సిద్ధమైనప్పటికీ, అమెరికా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు పెడుతోందని బఘాయీ ఆరోపించారు. తమ "రెడ్ లైన్స్" నుంచి వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రధానంగా తన అణు కార్యక్రమంపై అధిక పరిమితులను అంగీ కరించేందుకు సిద్ధంగా లేదనే సంకేతాలు ఇస్తోంది. అలాగే క్షిపణి కార్యక్రమం, ప్రాంతీయ మిత్ర బలగాలకు మద్దతు వంటి అంశాల్లో కూడా రాజీకి ఆస్కారం తక్కువగా కనిపిస్తోంది.

**కొనసాగుతున్న ఉద్రిక్తతలు**

ఒప్పంద చర్చలు జరుగుతున్నప్పటికీ, మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మాత్రం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. అమెరికా, ఇరాన్ ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుం -టున్నాయి. దక్షిణ ఇరాన్‌లోని రాడార్, నిఘా కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా, ప్రతిగా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. కాగా ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 89 డాలర్లకు పడిపోయి, ఒక్క రోజులోనే 4.4 శాతం క్షీణించింది. హార్ముజ్ జలసంధి మళ్లీ పూర్తిగా తెరుచుకుం టుందనే ఆశలు ఇందుకు కారణమ య్యాయి. ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ దాదాపు మూసివేయ డంతో గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటున్న విషయం విదితమే.

# విద్యుత్ ఛార్జీలను పెంచబోం

### జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దామన్న గొట్టిపాటి

### ట్రూడౌన్ విధానం ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించామని వెల్లడి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా దెబ్బతిన్న విద్యుత్ రంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా పునరుద్ధరించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని కేవలం రెండేళ్లలోనే సరిదిద్ది, పట్టాలెక్కించామని పేర్కొన్నారు.గత రెండేళ్లలో విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదని... రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వినియోగదారులపై అదనపు భారం మోపిన 'ట్రూ అప్' విధానానికి స్వస్తి పలికి, చరిత్రలోనే మొదటిసారిగా 'ట్రూ డౌన్' విధానాన్ని తీసుకువచ్చామని తెలిపారు. దీని ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించి, ప్రజలకు రూ. 4,498 కోట్ల మేర ఉపశమనం కలిగించామని వెల్లడించారు.గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని మంత్రి ధ్వజమెత్తారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 6 లక్షల ఉచిత సోలార్ కనెక్షన్లను అందించడానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనను గణనీయంగా పెంచడం ద్వారా, బయటి రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసే ఖరీదైన విద్యుత్ భారాన్ని తగ్గించామన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 160 గిగావాట్ల విద్యుత్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు పెద్ద సంఖ్యలో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు.

# పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు


మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో డీజిల్‌కు అసాధారణంగా డిమాండ్ పెరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధర, సాధారణ పెట్రోల్ బంకుల్లోని ధర కంటే ఎక్కువగా ఉండటంతో అనేక సంస్థలు బంకుల నుంచే భారీగా కొనుగోళ్లు చేస్తున్నాయి. దీంతో సాధారణ వినియోగదారులకు సరఫరా సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కేంద్రం భావించింది.
ఢిల్లీలో ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర పెట్రోల్ బంకులో రూ.95.20గా ఉంది. అదే బల్క్ కొనుగోలుదారులకు ఈ ధర రూ.134.50గా ఉంది. ఈ తేడా కారణంగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు బల్క్ డిపోల బదులు బంకుల వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని గుర్తుచేసింది. షిప్పింగ్ వ్యవస్థ కూడా ప్రభావితమవడంతో దేశీయంగా ఇంధన లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తాజా ఆంక్షలు తీసుకొచ్చింది.మరోవైపు 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' (పీఈఎస్ఓ) అనుమతి పొందిన కంటైనర్లకు మాత్రమే డీజిల్ విక్రయించాలి. ఒక వినియోగదారు లేదా ఒక వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల వరకు మాత్రమే డీజిల్ ఇవ్వాలని ఆదేశించారు. దీన్ని మళ్లీ విక్రయించడం పూర్తిగా నిషేధం. నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక కొనుగోళ్లు, ఇంధన మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.
ఈ ఆంక్షలు మొదట 90 రోజుల పాటు అమల్లో ఉంటాయి. అవసరమైతే మరో ఉత్తర్వుతో గడువును పొడిగించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా సాధారణ వినియోగదారులకు ఇంధన కొరత తలెత్తకుండా చూడటమే ఈ నిర్ణయం లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

## ఆటపాటలతో ఉత్సాహం గడిపిన పూర్వ విద్యార్థులు..





**శంషాబాద్,(ప్రజావినికిడి):** నర్కూడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2005-06 లో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో 2005-06 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం శంషాబాద్ మండల పరిధిలోని సుల్తాన్ పల్లి లోని బ్యూటీ గ్రీన్ రిసార్ట్ లో 20 సంవత్సరాల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ,ఉపాధి, వ్యాపార, ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట కలుసుకున్నారు. కుటుంబ యోగాక్షేమాలు అడిగి తెలుసుకుని తరగతి గదుల్లో గత మధుర స్మృతులను గుర్తుచేసుకొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి ఆశీర్వచనలు తీసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు.20 ఏళ్ళ తరువాత కూడా తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగో ఆవిష్కరణ




**హిమాయత్ నగర్ (ప్రజావినికిడి):** కరీంనగర్ పట్టణంలో సెప్టెంబర్ 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరగనున్న ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను హైదరాబాద్, హిమాయత్ నగర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం, సత్యనారాయణ రెడ్డి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్,ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్, సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్,ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, ఎం.ప్రవీణ్ కుమార్ లు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన నాలుగు నూతన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లపై ఈ మహాసభల్లో చర్చించి మరింత ఉధృతమైన పోరాట కార్యక్రమాలను నిర్ణయించనున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాలు చేసిన అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన సవరణ చేపట్టి, నామమాత్రంగా వేతనాలు పెంచి వాటిని జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చిందని, దీనిపై కూడా మహాసభల్లో చర్చించి,పోరాట కార్యక్రమాలు ఏ పద్ధతుల్లో నిర్వహించాలని నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు, కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా నిర్లక్షం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.బాల్ రాజ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే మహాసభలను విజయవంతం చేసేందుకు ఎఐటియుసి అనుబంధ అన్ని కార్మిక సంఘాలు, ఎఐటియుసి శ్రేణులు విశేషంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.మూర్తి, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సురేష్,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్,కృష్ణ తదితరులు హాజరయ్యారు.

# కాంగ్రెస్ యువ నాయకుడు సాజిద్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన శుభాకాంక్షలు

## శాలువాతో సన్మానించి ఆశీర్వదించిన ఎమ్మెల్యే శంకర్






**షాద్‌నగర్, (ప్రజావినికిడి):** కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సాజిద్ జన్మదిన సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆయనను ఆశీర్వదించారు.

శుక్రవారం ఎమ్మెల్యే శంకర్ స్వగృహంలో ప్రత్యేకంగా కలిసిన సాజిద్‌కు ఎమ్మెల్యే శంకర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, సాజిద్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో సంతోషంగా జరుపుకోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కృష్ణారెడ్డి,గుట్ట రాజు,యువ నాయకుడు నాని తదితరులు పాల్గొని సాజిద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# శని ప్రభావం సమయంలో జాగ్రత్తలు పాటించాలి

**జ్యోతిష్య పండితుడు కేఎం మనీష్ కుమార్ శర్మ -శని త్రయోదశి, అధికమాసం పూజలకు ప్రత్యేక ప్రాధాన్యం**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):** భక్తులు శని ప్రభావం ఉన్న కాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని జ్యోతిష్య పండితుడు కేఎం మనీష్ కుమార్ శర్మ సూచించారు. గోచారంలో శని ప్రభావం,ఏలినాటి శని,అష్టమ శని, అర్ధాష్టమ శని వంటి దశలు ఉన్నప్పుడు జీవితంలో వివిధ ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శని ప్రభావం సమయంలో చేపట్టిన పనుల్లో ఆలస్యం, అనుకోని ఇబ్బందులు, వాహన ప్రమాదాలు వంటి సమస్యలు ఎదురుకావచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలాంటి పని చేసినా తగిన ఆధారాలు, పత్రాలు లేకుండా ముందుకు వెళ్లకూడదని సూచించారు.

విద్య,ఉద్యోగం, వివాహం, వ్యాపారం వంటి రంగాల్లో ఎదురయ్యే ఆటంకాలు తొలగేందుకు శనివారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల మధ్య ఉండే శని హోరా సమయంలో శనీశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే స్వామివారి అనుగ్రహం లభిస్తుందని తెలిపారు.తల్లిదండ్రులకు, వయో వృద్ధులకు సేవ చేసే వారు శనేశ్వర స్వామి కృపకు పాత్రులవుతారని చెప్పారు. అధికమాసంలో దానధర్మాలు, పుణ్యకార్యాలు చేయడం ద్వారా అధిక ఫలితాలు లభిస్తాయని పేర్కొన్నారు.

అధికమాసంలో వచ్చిన శని త్రయోదశిని భక్తులు సద్వినియోగం చేసుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కేఎం మనీష్ కుమార్ శర్మ పిలుపునిచ్చారు.

# షాద్ నగర్ నియోజకవర్గంలో అందుబాటులో ఎరువులు

**షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్"**

**1లక్షా 26 వేల ఎకరాలకు 13వేల మెట్టి తన్నుల ఎరువులు సిద్ధం**

**యాప్ కష్టాల్లో అన్నదాతకు అండగా ఉండండి..**

**యాప్ సమస్యపై ప్రభుత్వంతో కూడా చర్చిస్తా..**

**రైతుల కోసం సమృద్ధిగా అందుబాటులో ఎరువులు..**

**ఎలాంటి కష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత మీదే..**

**ఈ సీజన్లో రైతులకు ఉపయోగపడే అంశాలను మీడియా ద్వారా వివరించండి..**

**షాద్ నగర్ నియోజకవర్గ వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** వర్షాకాలం వచ్చిన సమయంలో కొత్త పంటల కోసం ముస్తాబయ్యే రైతులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అధికారులు వాటిని అన్నదాతల వరకు చేర వేసే విషయంలో అండగా ఉండాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. పట్టణంలోని తన స్వగృహంలో వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఎక్కువగా నిరక్షరాస్యులే ఉంటారని,వారికి యాప్ ద్వారా సబ్సిడీ ఎరువులు, పొటాషియం, డిఏపి,కాంప్లెక్స్ ఎరువుల వంటివి దరఖాస్తు చేసుకోవడం తెలియదని వివరించారు. అధికారులు గ్రామాల్లోకి వెళ్లి రైతులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదే విధంగా ఈ విడత యాప్ ద్వారా కాకుండా నేరుగా చెల్లింపులు జరిగేలా తాను ప్రభుత్వంతో మాట్లాడుతానని ఆయన హామీ ఇచ్చారు.యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధానం తెలియక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఈ యాప్ ను ప్రచారంలోకి తీసుకువచ్చి రైతులకు అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ విషయంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను నివారించాల్సిన బాధ్యత అధికారుల పైన ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో తాను ఎప్పటికప్పుడు ఈ వ్యవసాయ సీజన్లో సంప్రదింపులు జరుపుతానని స్పష్టం చేశారు.

### సాగు ఇబ్బందులకు స్వస్తి..

షాద్ నగర్ నియోజకవర్గంలో 1లక్షా,26 వేల ఎకరాలలో వ్యవసాయం కొనసాగుతుందని, వరి,మొక్కజొన్న, పత్తితో పాటు ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారని వివరించారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరాన్ని బట్టి ఎరువులు,ఇతర వస్తువులను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన మీడియాకు వివరించారు. ప్రస్తుతం 13 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అదేవిధంగా



6000 మెట్రిక్ టన్నుల డిఏపి,9,000 మెట్రిక్ టన్నుల పొటాష్,1000 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. మండలాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి వారు ప్రభుత్వ సదుపాయాలు అందుకునేలా చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు. అదేవిధంగా ముఖ్యంగా ఈ వ్యవసాయ సీజన్లో అన్ని విషయాలను రైతులకు చేరవేసే విధంగా మీడియాను ఉపయోగించుకోవాలని ప్రతి అంశం మీడియా ద్వారా రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఏడి రమాదేవి, మాజీ జెడ్పిటిసి దామోదర్ రెడ్డి, సీనియర్ నేతలు కృష్ణారెడ్డి,శ్రీధర్ రెడ్డి,సురేష్ రెడ్డి, కేకే కృష్ణ,చందు నాయక్,ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ అన్ని మండలాల ఏవోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

**కొత్తపేట,జూన్,12 (ప్రజావినికిడి):** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ్ అధ్యక్షురాలు లెంకలపల్లి మంజుల రాజు ఆధ్వర్యంలో కొత్తపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా, భక్తిశ్రద్ధల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ మహోత్సవానికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా సామూహిక లలితాదేవి పారాయణం,విష్ణు సహస్రనామ పారాయణం, మణిద్వీప వర్ణన, వాసవీమాత గోష్టి సేవ వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. లోకక్షేమం,ప్రపంచ శాంతి,ప్రజల సుఖసంతోషాలు, సమాజంలో సామరస్యం నెలకొనాలని ఆకాంక్షిస్తూ ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం



ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందన్నారు.సమాజంలో ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. వైశ్య సమాజ ఐక్యతతో పాటు యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ఐవిఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో 45 మంది అయ్యగార్లను ఘనంగా సత్కరించి వాయిదాలు అందజేశారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించి భక్తులకు తీర్థ



ప్రసాదాలు పంపిణీ చేశారు.వచ్చిన మహిళలకు ప్రత్యేక పూజలు అందుకున్న కుబేర నాణెం బహుమతిగా అందజేశారు.కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కక్కిరాల రమేష్ సుజన,ఐవిఎఫ్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్త, ముస్తాల సత్తయ్య, పబ్బ చంద్రశేఖర్, కట్ట రవికుమార్ గుప్త,కటకం శ్రీనివాస్,నరేశ్, ప్రవీణ్,నవీన్,బెల్లె రవికుమార్, సంబుపాడు సప్త, బోనగిరి శ్రీనివాస్, చింతల రాజవకాంత్, మణిమాల,నలిని, అర్చన,రాధిక తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ నియోజకవర్గంలో "గుడిసెలు" కనిపించవద్దు

**అవసరమైతే నేనే వస్తా..**
**ఇందిరమ్మ ఇల్లు ఇస్తా..**

**ఇందిరమ్మ ఇల్లు ప్రతి అర్హుడికి అందాలి..**

**వివిధ దశల్లో 5,500 ఇందిరమ్మ ఇండ్లు..**

**నియోజకవర్గంలో 750 మంది లబ్ధిదారులు ఇంకా ఈ ఇంటి పనులు మొదలు పెట్టలేదు**

**నిర్లక్ష్యం చేస్తే అధికారులు నోటీసులు ఇస్తారు..**

**హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నిరుపేదలను ఇంటి యజమానులుగా మార్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని, షాద్ నగర్ నియోజకవర్గంలో గుడిసెలు కనిపించోద్దని ఎక్కడ చూసినా ఇందిరమ్మైన్లు పేద ప్రజల వద్ద ఉండేలా చేయాలన్నదే తన సంకల్పమని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర" సూచించారు. హౌసింగ్ అధికారులతో ఆయన స్వగృహంలో శుక్రవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణాల శాఖ డిప్యూటీ ఈఈ సురేష్, కొందుర్గు ఏఈ అన్వేష్,జిల్లేడు చౌదరి కూడా ఏఈఈ శివతేజ, కొత్తూరు నందిగామ మండలాల ఏఈ మౌనిక,ఫరూక్ నగర్ ఏఈ సాయినాథ్,షాద్ నగర్ టౌన్ కిషన్, కేశంపేట శంకర్ తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, షాద్ నగర్ నియోజక వర్గంలో తొలివిడతగా 3500 ఇండ్లు మంజూరు అయ్యాయని, అందులో 2200 ఇండ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. మరో 750 ఇండ్లు వివిధ దశలో ఉన్నాయని,మరో 750 మొదలు పెట్టాల్సి ఉందని తెలిపారు. కాగా నియోజకవర్గానికి మరో రెండు ప్రభుత్వం ద్వారా మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. వీటిని కూడా పార్టీలకు అతీతంగా అర్హులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో ఇల్లు పొందిన వారు, తండ్రి పేరు మీద ఇల్లు ఉండి ఫోటోలు దిగిన కొడుకులు,టాక్సీ లాంటి వాహనాలు ఉన్నవాళ్లు అర్హులు అయినప్పటికీ ఇండ్లు మంజూరు కావడం ఆగిపోయిందని, కేంద్ర ప్రభుత్వ నిబంధనలే ఇందుకు కారణమని ఆయన వెల్లడించారు. అయితే త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి అర్హులకు ఇండ్లు అందించే ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇండ్ల కోసం అందుతున్న డబ్బులు సక్రమంగా అందుతున్నాయనికేంద్ర ప్రభుత్వం మాత్రం తన వంతుగా ఇచ్చే సొమ్ము అందించడంలో జాప్యం చేస్తుందని, ఇది లబ్ధిదారులకు ఇబ్బందిగా మారుతుందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్మించే ఇంటికి రూ. 70,000, పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇంటికి లక్షన్నర రూపాయలు చొప్పున కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ చెల్లించాల్సి ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై స్పందించాలని కోరారు. ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల అధికారులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన స్పష్టం చేశారు.

### ఇల్లు కట్టని వారికి నోటీసులు

ప్రభుత్వం పేద ప్రజలకు మంజూరు చేసిన ఇళ్ల విషయంలో గడువు గడిచిపోతున్న ఇంకా పనులు మొదలుపెట్టని వారికి గృహ నిర్మాణ శాఖ అధికారులు నోటీసులు ఇస్తారని దానికి సంజయ్ శివ్వాల్సిన అవసరం ఉంటుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఒకవేళ ఇల్లు కట్టుకోవడానికి ఏదైనా ఆటంకాలు ఇబ్బందులు ఇతర విషయాలు ఉంటే వారు ఈ నోటీసు తీసుకున్నాక వాటిని ప్రారంభించక పోతే అదే గ్రామంలో మరో లబ్ధిదారుడికి ఇంటిని ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాలను మొదలు పెట్టకపోతే నిధులు వృధా అయిపోతాయని కచ్చితంగా మంజూరు చేసుకున్నవారు ఇండ్లు కట్టె ప్రయత్నం చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు 750 ఇండ్లు ఇంకా పనులు మొదలు పెట్టలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

### అన్ని పథకాలు అందుబాటులోకి

ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ అన్ని పథకాలను ప్రజల ముందుకు తెస్తుందని స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్,రూ. 500 కే గ్యాస్ లాంటివి ఇప్పటికే అమలులోకి వచ్చాయని,రేషన్ కార్డులు కూడా ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం పెన్షన్ల కోసం కూడా దరఖాస్తులు గ్రామసభల ద్వారా స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఇక ఇందిరమ్మ ఇండ్లు కూడా అర్హులందరికీ అందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి అన్నారు. పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు గ్రామీణ ప్రాంతాలలో ప్రచారం కల్పించాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ కూడా ఒక్క గుడిసె కూడా కనిపించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. అధికారులు గ్రామీణ ప్రాంతాలలో తిరిగి నిజమైన అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిప్యూటీ ఈఈ సురేష్, కొందుర్గు ఏఈ అన్వేష్,జిల్లేడు చౌదరి కూడా ఏఈఈ శివతేజ, కొత్తూరు నందిగామ మండలాల ఏఈ మౌనిక,ఫరూక్ నగర్ ఏఈ సాయినాథ్,షాద్ నగర్ టౌన్ కిషన్, కేశంపేట శంకర్, మాజీ జెడ్పిటిసి దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి,శ్రీధర్ రెడ్డి,సురేష్ రెడ్డి, సర్పంచ్ చందు నాయక్,కేకే కృష్ణ, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతులతో చెరకు సాగులో
## అద్భుతాలు సృష్టిస్తున్న రైతు రఫీఖ్ అహ్మద్ పటేల్..






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
భూమిని నమ్ముకుని జీవిస్తూ, అన్నదాత కష్టాలను స్వయంగా అనుభవించి,ఆ తర్వాత ప్రజా సంక్షేమం కోసం రాజకీయ నాయకుడిగా ఎదుగుతున్న ఆదర్శ రైతు కథనం ఇది, రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం సంతాపూర్ గ్రామానికి చెందిన రైతు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీఖ్ అహ్మద్ పటేల్ చెరకు సాగులో వినూత్న పద్ధతులను అనుసరిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సాంప్రదాయ వ్యవసాయ విధానాలకు భిన్నంగా ఆధునిక యాజమాన్య పద్ధతులు,డ్రిప్ ఇరిగేషన్,అంతర పంటల సాగుతో అధిక దిగుబడులు సాధిస్తూ విజయవంతమైన రైతుగా గుర్తింపు పొందుతున్నారు రఫీఖ్ అహ్మద్ పటేల్ తన 6.5 ఎకరాల వ్యవసాయ భూమిలో కో. 13007 హై షుగర్ రకం చెరకు పంటను సాగు చేశారు నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అమలు చేశారు నాణ్యమైన విత్తనాలు, సేంద్రీయ ఎరువులు, సమయానుకూల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని రఫీఖ్ అహ్మద్ పటేల్ తెలిపారు ఈ పద్ధతుల ద్వారా ఎకరాకు లక్షల రూపాయల ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు చెరకు పంట కేవలం రెండు నెలల 20 రోజుల వ్యవధిలోనే అద్భుతంగా పెరగడంతో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిషన్ రెడ్డి ప్రత్యేకంగా పొలాన్ని సందర్శించి పంటను పరిశీలించారు పంట అభివృద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆయన రైతు రఫీఖ్ అహ్మద్ పటేల్‌ను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషన్ రెడ్డి మాట్లాడుతూ చెరకు సాగులో ఎక్సాలి,అడ్సాలి, కంసాలి వంటి వివిధ కాలానుగుణ పద్ధతులు ఉన్నాయని వివరించారు చెరకు పంటకు సూక్ష్మ పోషకాలతో పాటు నత్రజని, భాస్వరం, పొటాషియం, డీఏపీ వంటి ఎరువులను సమతుల్య నిష్పత్తిలో అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు భవిష్యత్తులో కూడా చెరకు సాగు అభివృద్ధికి అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందిస్తానని రైతుకు హామీ ఇచ్చారు అలాగే కావేరి మైక్రోటెక్ సీడ్స్ కంపెనీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఘనబాబు కూడా పంటను పరిశీలించి రైతును అభినందించారు ఈ సందర్భంగా కంపెనీకి సంబంధించిన విత్తనాలు, క్రిమిసంహారక మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు
రైతుగా ఉండి రాజకీయ నాయకుడిగా ఎదిగిన రఫీఖ్ అహ్మద్ పటేల్ ఎప్పుడూ ప్రజలకు, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు అందుబాటులో ఉంటూ వారి జీవన విధానంలో మమేకమై సాదాసీదా జీవనం గడుపుతున్నారు "రైతే రాజు" అనే భావనను ఆచరణలో చూపిస్తూ సంతాపూర్ గ్రామ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కావేరి మైక్రోటెక్ సీడ్స్ కంపెనీ సిబ్బంది వరప్రసాద్, సయ్యద్ సిరాజ్ ఉల్ హక్,బషీర్ పటేల్, నజుముద్దీన్,కరీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం లో మైనర్ బాలికపై వేధింపులకు పాల్పడి హత్య యత్నం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలి

**కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**

**ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయదేవి డిమాండ్..**



**ఖమ్మం,(ప్రజావినికిడి):**ఖమ్మంలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి భవనం పై నుంచి క్రిందకు నెట్టి హత్య చేయాలని ప్రయత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ ఛాయదేవి, సహాయ కార్యదర్శి ఎండి ఫైమీద, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని డిమాండ్ చేశారు. శుక్రవారం రోజు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ, మైనర్ బాలికపై దాడి చేసిన నిందితుడిని ఫాస్టట్రాక్ కోర్ట్ ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## పాలమూరు-రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల పథకాల పురోగతిపై కమిషనర్ సమీక్ష సమావేశం




**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ పునరావాసం, పునర్ఉపాధి మరియు భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన కమిషనర్ కె. శివకుమార్ నాయుడుకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అనంత్ రెడ్డి,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) సునీల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం,దిండి ఎత్తిపోతల పథకం తదితర ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు,పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కందుకూరు, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆమనగల్లు, మాడ్గుల్ తహసీల్దార్లు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీజీపీఎస్సీ గరిష్ట వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచాలి..



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం కుఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వినతిపత్రం అందజేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (౧ఙూజ) ద్వారా విడుదలవుతున్న నియామక నోటిఫికేషన్లలో గరిష్ట వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 44 సంవత్సరాల నుండి 46 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ టీజీపీఎస్సీ
చైర్మన్ బుర్రా వెంకటేశం కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో అమలులో ఉన్న జి ఓ వీం. No.42 ప్రకారం 46 సంవత్సరాల వరకు వయోపరిమితి ఉండేదని, అనంతరం జారీ చేసిన › z Ms. No.86 ద్వారా 44 సంవత్సరాలకు పరిమితం చేయడం వల్ల అనేక మంది అర్హులైన అభ్యర్థులు అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అనేక శాఖల్లో చాలా సంవత్సరాల తర్వాత నియామక నోటిఫికేషన్లు విడుదల అవుతున్నాయని,ముఖ్యంగా డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డిఈఓ), డిగ్రీ కళాశాల లెక్చరర్ వంటి పోస్టులకు సుదీర్ఘ విరామం తర్వాత నోటిఫికేషన్లు వెలువడుతున్నాయని పేర్కొన్నారు. క్రమబద్ధమైన వార్షిక నియామక క్యాలెండర్ లేకపోవడం వల్లపిజి,పీహెచ్డీ వంటి ఉన్నత విద్యార్హతలు కలిగిన అనేక మంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యుత్తమ విద్యార్హతలు,విషయ పరిజ్ఞానం అనుభవం ఉన్నప్పటికీ ప్రస్తుతం అనేక మంది అభ్యర్థులు తక్కువ వేతనాలతో ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నారని వారికి కూడా ప్రభుత్వ సేవలో చేరే అవకాశం కల్పించేందుకు గరిష్ట వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచడం అవసరమని కోరారు. అదేవిధంగా దరఖాస్తు రుసుమును ప్రస్తుతం ఉన్న రూ. 1000 నుండి రూ. 100కు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ యువతపై భారం తగ్గించి,ఎక్కువ మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ప్రభుత్వం టిజిపిఎస్ సి అధికారులు ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖరరెడ్డి,ఇంద్ర నాయక్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ఏకతాటిపైకి హరిత సంఘాలు

## ఓరుగల్లు గడ్డపై చారిత్రాత్మక రాష్ట్రస్థాయి సమావేశం -ఐక్యవేదిక ఏర్పాటుపై ఏకగ్రీవ తీర్మానం

**హనుమకొండ,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్న స్వచ్ఛంద సంఘాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహత్తర సంకల్పంతో, హనుమకొండ నగరంలో కలెక్టరేట్ సమీపంలోని నక్కలగుట్టలో గల కాకతీయ హరిత ప్రాంగణంలో రాష్ట్రస్థాయి సమావేశం అత్యంత ఘనంగా జరిగింది. ప్రకృతి పట్ల అపారమైన ప్రేమ, పర్యావరణం పట్ల చెరగని నిబద్ధత కలిగిన వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ ఆధ్వర్యంలో,వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారు. గణేష్ ప్రకృతి ప్రేరణతో ఈ ఐక్యవేదిక రూపుదిద్దుకోవడం అందరికీ ఆనందదాయకమైంది.





సమావేశంలో ముఖ్య కార్యనిర్వాహక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహాసంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సింహాచలం లక్ష్మణస్వామి మాట్లాడుతూ, మొక్కలు నాటే క్రమంలో ఔషధ మొక్కలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని వివరించడం సభికులందరి మన్ననలు పొందింది.ఔషధ మొక్కల పెంపక కార్యక్రమాన్ని త్వరలోనే అన్ని సంఘాలు ఐక్యంగా చేపట్టాలని సమావేశం అభిప్రాయపడింది. నిరామయ సంస్థ వ్యవస్థాపకుడు నరేందర్ రెడ్డి,సేవ్ ఎర్త్ ఫౌండేషన్వ్యవస్థాపకుడు సురేందర్, ఎండి.రఫీయుద్దీన్ వ్యవస్థాపక అధ్యక్షులు-ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్ ఆర్గనైజేషన్తో పాటు స్థానికంగా పనిచేస్తున్న అనేక సంఘాల ముఖ్యులు, ప్రముఖులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొని విలువైన సూచనలు చేశారు.

ప్లాస్టిక్ నివారణ, సౌరశక్తి వినియోగం,సౌర ఫలకాల ఏర్పాటు, నీటి యాజమాన్యం, నీటి నిల్వల పెంపు,ఇంకుడు గుంతల నిర్మాణం, నిస్సహాయులకు సేవ-ముఖ్యంగా రాబోయే వర్షాకాలంలో విస్తృత స్థాయిలో చేపట్టవలసిన అనేక హరిత కార్యక్రమాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను సమావేశం ప్రకటించింది.

నిస్వార్థంగా, ప్రకృతి పట్ల ప్రేమతో,ఎంతో చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతినిధులు తరలిరావడం ఎంతో గొప్ప విషయమని అదనపు కలెక్టర్ వై.వి.గణేష్ ప్రత్యేకంగా అభినందించారు. పర్యావరణ ప్రేమికులు,ప్రకృతి ప్రేమికులు అందరూ ఏకమై ఒకే తాటి కిందికి వచ్చి,తమ ఆలోచనలను పంచుకొని పర్యావరణ పరిరక్షణకు సంయుక్తంగా కృషి చేయడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లా నుంచి ఈ వేదికకు ప్రాతినిధ్యం ఉంటుందని, పర్యావరణం కోసం పనిచేస్తున్న వ్యక్తులు,చిన్న చిన్న సమూహాలు, సంఘాలు అన్నింటినీ ఇందులోకి ఆహ్వానిస్తామని, ప్రతి ఒక్కరికీ తప్పక అవకాశం కల్పిస్తామని వేదిక బాధ్యులు ప్రకటించారు. ప్రభుత్వపరంగా అవసరమైన సహకారాల కోసం తగిన సూచనలు చేస్తానని గణేష్ హామీ ఇచ్చారు. త్వరలోనే వేదిక పేరును అధికారికంగా ప్రకటించి, చిహ్నాన్ని ఆవిష్కరించి అందరికీ ఆత్మీయ హరిత సందేశం అందిస్తామని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం, పచ్చదనం పెంపు కోసం,ఔషధ మొక్కల పెంపకం కోసం, దురలవాట్లకు దూరంగా ఉండేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా, క్రమశిక్షణతో మెలగాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ ఐక్యవేదిక ఏర్పాటు ఎంతో చారిత్రాత్మకమైనదని, ప్రకృతిహితమైనదని,ఓరుగల్లు గడ్డపై ఇదొక గొప్ప మలుపురాయిగా, గీటురాయిగా నిలుస్తుందని వక్తలు అభివర్ణించారు. మున్ముందు మరిన్ని గొప్ప కార్యక్రమాలు చేపట్టాలని సభికులంతా ముక్తకంఠంతో ప్రతిజ్ఞాపూర్వకంగా తీర్మానించుకోవడం సమావేశానికి ప్రత్యేక శోభను చేకూర్చింది.

సమావేశ విశేషాలు ముఖ్య అతిథి సందేశం
విశ్రాంత జిల్లా అటవీ అధికారి కాజీపేట పురుషోత్తం అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ వై.వి.గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహించాలని, ముఖ్యంగా విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలని కోరారు. వర్షపు నీటి సంరక్షణ గుంతలను పరిరక్షించడం ద్వారా భూగర్భ జలాలను కాపాడవచ్చని తెలిపారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో ప్రభావంతో ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా పంటల మార్పిడిని ప్రోత్సహిస్తోందని, తక్కువ నీటితో సాగయ్యే పంటలను రైతులు ఎంచుకోవాలని తెలిపారు.సౌరశక్తి వినియోగాన్ని గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

రాబోయే వర్షాకాలాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని హరిత స్వచ్ఛంద సంస్థలు విస్తృత స్థాయిలో మొక్కల పెంపక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పది నుంచి పన్నెండు అడుగుల ఎత్తు గల మొక్కలను రక్షిత ప్రాంతాలు, ప్రభుత్వ భూములు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని హరిత సంస్థలు, పర్యావరణ కార్యకర్తలు, ప్రకృతి ప్రేమికులు ఒకే వేదికపైకి వచ్చి రాష్ట్రస్థాయి సమాఖ్యను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ,జల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ వంటి అంశాలపై సమన్వయంతో పనిచేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

పాల్గొన్నవారు..ఈ సమావేశంలో సింహాచలం లక్ష్మణస్వామి, నరేందర్ రెడ్డి, సురేందర్, రఫీయొద్దీన్, శ్రావణ్ కుమార్, అనితా రెడ్డి,రాధ, మండల పరశు రాములు, మాచవరం శశిధర్, యోగేశ్వర్, ఉపేందర్ రెడ్డి, నరేష్,ప్రకాష్, సమ్మయ్య, రాజశేఖర్, ఉద్యానవన శాఖ అధికారి రమేష్, ఉపాధ్యాయుడు ఉప్పలయ్య, మెప్మా జిల్లా మిషన్ సమన్వయకర్త శ్రీమతి రేణుక, విశ్రాంత జిల్లా అటవీ అధికారి జి. రవీందర్ మండల పరశురాములు,మాధ్యమ సమన్వయకర్త, హరిత స్వచ్ఛంద సంస్థల బృందం తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మరింత హరిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

---





# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం

రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు

- స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం
- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది

**తిరుపతి,జూన్ 12 (ప్రజావినికిడి):**
స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ,




అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, ఢిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు.

---

# ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ

## డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్





- ప్రజలు అధికారంతో పాటు .. అతి పెద్ద బాధ్యత అప్పగించారు
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి

ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ

ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

# బడిలోనే ..దేశ భవిష్యత్‌కు పునాది !

**జూన్ 12(ప్రజావినికిడి):**
విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే



ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

## స్కూలు డ్రెస్సుల కుంభకోణం

### వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

**హైదరాబాద్,జూన్ 12(ప్రజావినికిడి):**
స్కూల్ డ్రెస్సులను కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామని గతంలో సిఎం ప్రకటించినట్లు సమాచారం. వారికి ఈ పని అప్పగిస్తే మరింత మంచి ఫలితం వస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించారని విపక్ష నేత హరీష్ రావు చేసిన ఆరోపణలపై నిజాలు వెలుగు చూడాల్సి ఉంది. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాంట్రాక్టులు, కమిషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేశారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్ క్యాప్‌కు ఇచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం వాటిని సెంట్రలైజ్ చేసి.. గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని మండిపడ్డారు. ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని, 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, పుస్తకాలు ఏవీ అందలేదన్నారు.

## ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

### నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్



**చెన్నై,జూన్ 12 (ప్రజావినికిడి):**
ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు. తుది నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు. పొలిటికల్ ఎంట్రీపై త్వరలో ప్రకటన చేస్తానని చెప్పారు. లారెన్స్ తన పోస్టులో.. 'ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. మీ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించండి. ఈ వీడియో చూసిన తర్వాత, దయచేసి మీ సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్స్ రూపంలో పంచుకోండి. మీరు 'వద్దు' అని చెబితే.. నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవను ఇలాగే కొనసాగిస్తాను. కానీ మీరు 'అవును' అని చెబితే.. మీ అందరి ఆశీస్సులతో ఈ రాజకీయ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో కలిసి ప్రారంభించాలో నిర్ణయించుకుంటాను' అని పేర్కొన్నారు.

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపపు వ్యవహారం


### బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ




**వాషింగ్టన్,జూన్ 12(ప్రజావినికిడి):**
హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గేది లేదని తేల్చారు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట లభించనట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లేనని భావిస్తున్నారు.

## మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై నారాయణగూడ పోలీసులు దర్యాప్తును వేగవంతం

**హైదరాబాద్‌జూన్ 12(ప్రజావినికిడి):**మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై నారాయణగూడ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మామిడి పండ్లు తిని భువనేశ్వరి(17), సంధ్య(10) తీవ్ర అస్వస్థకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటక బీదర్ వాసులు వైజినాథ్, ఇందుమతి దంపతులు కొన్నాళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇందుమతి బంధువు రేణుక ఈనెల జలమండలి వద్ద రెండు కేజీల మామిడి పండ్లను కొనుగోలు చేసింది. ఆ పండ్లను ఇందుమతి, ఆమె నలుగురు కుమార్తెలు తిన్నారు. ఆపై వారంతా వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు



గురయ్యారు. చికిత్స పొందుతూ అక్కాచెల్లెళ్లు భువనేశ్వరి(17), సంధ్య(10) మృతి చెందగా.. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి మామిడి పండ్లు తొందరగా మగ్గేందుకు వినియోగించే రసాయనాలు కారణమా?... లేక ఇతర పదార్థాల వల్ల జరిగిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, వైద్యుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఫుడ్, ఫ్రూట్ నమూనాలను సేకరించిన అధికారులు.. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. గత నెలలో ఛత్తీస్‌గఢ్ జాంజ్‌గిరి-చంపా జిల్లాలో పుచ్చకాయ తిని 15 ఏళ్ల బాలుడు మరణించగా, మరో ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో వరుస ఘటనలతో మామిడి పండ్లు, పుచ్చకాయలు కొనాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో సమగ్ర దర్యాప్తు చేపట్టామని కమిషనర్ సజ్జన్నార్ తెలిపారు.

## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

### రష్యాతో చమురు కోనుగోళ్లను సమర్ధించిన జైశంకర్

#### అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి

**న్యూఢిల్లీ,జూన్ 12 (ప్రజావినికిడి):**
పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు.



రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పూరీ మార్క్... స్లమ్ డాగ్ టీజర్



డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.

--------

# మాటే పాటయితే..సింగీతం తరహా మూవీ

## సింగ్ గీతంతో కొత్తగా ఆలోచించిన దర్శకుడు

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ




ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం. అసలు ఇలాంటి ఆలోచన రావడమే నిజంగా గొప్ప విషయం. ఈ విభిన్నమైన కథ ద్వారా చాలా గొప్ప విషయాలను స్పృశించారు సింగీతం. పచ్చని చెట్టు బంగారం కంటే మిన్న అనే సందేశం ఈ సినిమాతో ఆయనిచ్చారు. పర్యావరణం గొప్ప తనాన్ని తెలిపేలా ఈ సినిమా తీశారు. సింగీతం విజన్‌ని, తెరపైకి తెచ్చేందుకు నాగ్ అశ్విన్ పడిన కష్టం అణువణువునా కనిపించింది. ఈ ప్రయోగం జనానికి ఎక్కితే, ఇది కచ్చితంగా మరో గొప్ప ప్రయత్నం అవుతుందని చెప్పక తప్పదు.

. ప్రయోగాత్మక చిత్రాలు ఇష్టపడే వాళ్లకు 'సింగ్ గీతం' కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది.



# నానీ మూవీలో రుక్మిణీ వసంత్

సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.

---------

# కిరణ్ అబ్బవరం కెఎ 13

## సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు



యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

# జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృత్రిక్ ?

సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# మా ఇంటి బంగారం సమంత కోసం వెయిటింగ్

మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యూఏ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు.. వెచ్చించే సమయానికి.. అన్నింటికీ న్యాయం చేసేలా ఉంటుంది' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613